ప్రజాశక్తి
శుక్రవారం 22 నవంబర్ 2024
5
శ్రీ సత్యసాయి





మృతి చెందిన కృష్ణకిశోర్, శిరీష, చిన్నారి

ప్రాణం తీసిన రుణభారం

◆ ఐదు నెలల చిన్నారితో సహా భార్యాభర్తల ఆత్మహత్య
◆ అనంతపురం జిల్లా నార్పలలో విషాద ఘటన

రుణభారం ఓ కుటుంబాన్ని బలితీసుకుంది. మెడికల్ షాప్ నిర్వహణ కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక వారి ఐదు నెలల చిన్నారితో పాటు భార్యాభర్తలు ఉరేసుకుని తనవు చాలించారు. అనంతపురం జిల్లా నార్పల మండలంలో గురువారం వెలుగు చూసిన ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. నార్పల మండల కేంద్రంలోని పాత పోలీసు స్టేషన్ సంతబజారులో నివసిస్తున్న భార్యాభర్తలు కృష్ణకిషోర్ (45), శిరీష(35) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తాము మరణిస్తే తమ కూతురు అనాథ అవుతున్న బాధతో ఐదు నెలల చిన్నారిని చంపి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన నాలుగు రోజుల క్రితం చోటు చేసుకోగా గురువారం నాడు స్థానికుల సమాచారం మేరకు బయటకు తెలిసింది. మెడికల్ స్టోర్ నిర్వహించే కృష్ణ కిశోర్ ఆర్థిక ఇబ్బందులను తాళలేకనే కుటుంబం మొత్తం తనువు చాలించినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

వార్త మెయిన్‌లో

అదానీ ప్రాజెక్టులపై నీలినీడలు..!

అదానీ గ్రీన్ ఎనర్జీ పేరుతో అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో ఏర్పాటు చేయబోతున్న సోలార్ పవర్ ప్రాజెక్టుల పరిస్థితి ఏమవుతుందన్న సందేహాలు సర్వత్రా నెలకొన్నాయి. అమెరికాలో సోలార్ పవర్ ప్రాజెక్టుల కోసమని రుణం పొందే విషయంలో అక్కడి కోర్టు అదానీకి అరెస్టు వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. అది కూడా గ్రీన్ ఎనర్జీకోసం డబ్బులు సమకూర్చే క్రమంలోనే అక్కడి అధికారులకు డబ్బులు ఎర చూపారన్న అభియోగాలపై కోర్టు ఆదేశాలిచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఇక్కడి సోలార్ ప్రాజెక్టులపై ఈ ప్రభావం ఎంత మేరకు ఉండనుందన్నది చర్చ నడుస్తోంది.



◆ చిత్రావతి డ్యామ్‌పై హైడ్రో ఎలక్ట్రిక్ సోలార్ ప్రాజెక్టు
◆ రాయదుర్గం వద్ద సోలార్ ప్లాంట్
◆ అమెరికాలో అదానీకి అరెస్టు వారెంట్‌తో వీటి కదలికపై సందేహాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సత్యసాయి జిల్లాకు ఆనుకుని కడప జిల్లా పరిధిలో ఉన్న చిత్రావతి డ్యామ్‌పై సోలార్ పంప్డు ఎనర్జీ ప్లాంటు ఏర్పాటు పనులు నడుస్తున్నాయి. పగటి సమయాల్లో సోలార్ సహాయంతోనూ, రాత్రి సమయాల్లో డ్యామ్‌లోని నీటితో విద్యుత్ ఉత్పత్తి జరిగే విధంగా దీని ఏర్పాటు పనులు నడుస్తున్నాయి. 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేయబోతున్న ప్రాజెక్టు పనులు 2023 మార్చి నుంచి ప్రారంభం అయ్యాయి. ఇప్పటికే సర్వేలు పూర్తయ్యి ప్లాంటు ఏర్పాటు పనులు నడుస్తున్నాయి. ఇదే విధంగా అనంతపురం జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గంలో సుమారు పది వేల ఎకరాల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ఆ సంస్థ ప్రకటించింది. దీనికి సంబంధించి భూ సమీకరణ పనులను చేపట్టేందుకు గత ప్రభుత్వమే ఉత్వర్వులు ఇచ్చింది. అవసరమైతే 30 వేల ఎకరాలు కూడా ఇస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు వివరాలను ఆ సంస్థకు అందజేశారు. రైతులకు లీజు పద్ధతిలో భూసేకరణ చేపట్టే విధంగా ఉత్వర్వులిచ్చి ఉన్నారు. ఈ మేరకు అదానీ సంస్థ ప్రతినిధులు కూడా భూమిని పరిశీలించి వెళ్లారు. అయితే ఇంకా ఈ ప్రాజెక్టుపై కదలిక రాలేదు. రాబోయే రోజుల్లో వచ్చే అవకాశాలున్నాయన్న ప్రచారం నడుస్తోంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై ఎటువంటి ప్రకటనా రాలేదు. ఇప్పుడు అదానీపై న్యాయపరమైన చర్యలు రావడంతో ఈ ప్రాజెక్టుల పురోగతిపైనా సందేహాలు నెలకొంటున్నాయి. ఇప్పటికే భూములను కట్టబెట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు కూడా ఇచ్చి ఉండటం గమనార్హం.

రైతుల్లో ముందు నుంచి గుబులు

ఈ సంస్థ ఏర్పాటు చేస్తారన్నప్పటి నుంచి రైతుల్లో గుబులు నెలకొంటోంది. ఎందుకంటే లీజు పద్ధతిలో సేకరించేందుకు సిద్ధపడుతోంది. లీజు పద్ధతిలో తీసుకున్నాక సకాలంలో లీజు చెల్లించకుంటే ఏదైనా సమస్య వస్తే తమ భూముల పరిస్థితి ఏమిటన్న గుబులు రైతుల్లో నెలకొంది. ఈ సంస్థపై పదేపదే ఆరోపణలొస్తూనే ఉన్నాయి. గతంలో లాగ భూసేకరణ ఎపిఐఐసి ద్వారా కాకుండా సాంప్రదాయ ఇంధన వనరుల శాఖకే అప్పగిస్తున్నారు. సంస్థ చెల్లించలేని పక్షంలో ఆ శాఖ ద్వారా చెల్లించేందుకు కూడా వీలుండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తమ భూముల ఏమవుతాయోనన్న భయం కూడా వారిని వెంటాడుతోంది.

నేడు పుట్టపర్తికి గవర్నర్

రేపు బాబా జయంత్యుత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం నాడు పుట్టపర్తికి విచ్చేయనున్నారు. శ్రీసత్యసాయి బాబా జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించే కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. గవర్నర్ పర్యటన వివరాలను కలెక్టర్ టిఎస్.చేతన్ గురువారం ప్రకటన ద్వారా తెలియజేశారు. గురువారం రాత్రి 8 గంటలకు బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి 10 గంటలకు చిలమత్తూరు మండలం రక్ష అకాడమీ అతిథి గహంలో కొంత సమయం విశ్రాంతి తీసుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి 11 గంటలకు పుట్టపర్తి సాయి శ్రీనివాస అతిథి గహానికి చేరుకుంటారు. ఆరోజు రాత్రి అక్కడే బస చేస్తారు. 23వ తేదీ ఉదయం 9 గంటలకు సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి బాబా సమాధిని సందర్శించుకుంటారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీ భగవాన్ సత్య సాయి బాబా 99వ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఉదయం 11:05 గంటల 11:20 గంటల వరకు శ్రీ సాయి శ్రీనివాస అతిథి గహంలో విశ్రాంతి తీసుకుంటారు. అక్కడి నుంచి పుట్టపర్తి నుండి రోడ్డు మార్గం ద్వారా మధ్యాహ్నం 12:20 నిమిషాలకు రక్ష అకాడమీ అతిథి గహంలో విశ్రాంతి తీసుకుని, 12:35 గంటలకు రోడ్డు మార్గం ద్వారా బెంగళూరు వెళ్లనున్నారు.

ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ పరిశీలన

గవర్నర్ పుట్టపర్తికి విచ్చేస్తున్న నేపథ్యంలో కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్నలు సత్యసాయి ట్రస్టు సభ్యులతో కలిసి గురువారం ఏర్పాట్లు పరిశీలించారు. సాయి శ్రీనివాస అతిథి గహాన్ని పరిశీలించి అక్కడి ఏర్పాట్లుపై అధికారులతో మాట్లాడారు. ఆ ప్రాంతంలో సూచిక బోర్డులు ప్రదర్శించాలని ఆర్డీవోను ఆదేశించారు. ప్రోటోకాల్, పోలీసు బందోబస్తు ఏర్పాటు, సాయి శ్రీనివాస్ అతిధి గహమునందు, కుశ్వంత హాలు, కాన్వాయ్ నిర్వహణ ట్రాఫిక్ సడలింపు, పారిశుధ్య పనులు, బ్యారి గేడ్స్ ఏర్పాటు చర్యలు తదితర వాటిపై సంబంధిత శాఖ అధికారులు దృష్టిని సారించాలన్నారు. గవర్నర్‌కు స్వాగతం పలికే సమయం నుంచి వీడ్కోలు వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన మేరకు చర్యలు తీసుకుని పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



సాయి శ్రీనివాస అతిథి గృహం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గార్మెంట్స్ పరిశ్రమలో

అనుమానాస్పద స్థితిలో కార్మికుడు మృతి



తన భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తున్న మృతుని భార్య గీత (ఇన్‌సెట్‌లో మృతుడు శివకుమార్)

ప్రజాశక్తి-హిందూపురం , పరిగి

పరిగి పట్టణ సమీపంలో ఉన్న ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ పరిశ్రమలో విధి నిర్వహణలో ఉన్న కార్మికుడు శివ కుమార్ (32) అనుమానాస్పదస్థితిలో గురువారం మృతిచెందాడు. లేపాక్షి మండలం చోళ సముద్రానికి చెందిన గోవిందప్ప కుమారుడు దళిత శివకుమార్ ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ పరిశ్రమలో ఫినిషింగ్ సెక్షన్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగానే శివకుమార్ గురువారం విధులకు హాజరయ్యాడు. విధి నిర్వహణలో ఉండగా ఒక్కసారి కుప్ప కూలిపోగా వైద్య సేవల నిమిత్తం హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చినట్లు పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఆర్ మేనేజర్లు చెబుతున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే శివకుమార్ మృతి చెందినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న మృతుని బంధువులు, స్నేహితులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకుని గవర్నమెంట్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఆర్ మేనేజర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వచ్చి ఉంటే శివకుమార్ బతికే వాడని వారు అన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే శివకుమార్ మృతి చెందాడని ఆరోపించారు. ఈ సందర్భంలో మృతుని బంధువులు, హెచ్‌ఆర్ మేనేజర్ల మధ్య కొద్దిసేపు మాటల యుద్ధం జరిగింది. ఈ విషయాలను తెలుసుకున్న వెంటనే పరిగి ఎస్ఐ రంగడు తన సిబ్బందితో కలిసి ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ఇరు వర్గాల వారితో చర్చించారు. మృతుని తండ్రి గోవిందప్ప మాట్లాడుతూ తన కుమారుడుది ఆకస్మిక మరణం కాదని, అనుమానాస్పదంగా ఉందని అన్నారు. పరిశ్రమలో ఆ సెక్షన్ కు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ లు చూపించమని అడుగుతున్నప్పటికీ లేవని బుకాయిస్తున్నారని అన్నారు. ఈ విషయం పై మేనేజర్‌ను ఎస్ఐ ప్రశ్నించారు. సీసీ ఫుటేజ్ లు ఎందుకు లేవని ప్రశ్నించారు. ప్రతి విభాగానికి సీసీటీవీలో ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అత్యవసర విభాగాలలో మాత్రమే సిసి టీవీలు ఏర్పాటు చేసినట్లు పరిశ్రమ మేనేజర్ పేర్కొన్నారు. మృతుని భార్య గీత హిందూపురం రూరల్ మండలం గుడంపల్లి సమీపంలో ఉన్న కియా అనుబంధ కెఐఎంఎల్ పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేస్తున్నది. భర్త మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే ఆమె ఆసుపత్రికి చేరుకుంది. పోస్టుమార్టం గదిలో ఉన్న భర్త మృతదేహంపై పడి తమకు ఇక దిక్కు ఎవరంటూ బోరున విలిపించింది. ఈ విషాద సంఘటన అక్కడ ఉన్న ప్రతి ఒక్కరిని కన్నీరు పెట్టించింది. అనంతరం మృతుని భార్య, తండ్రి మాట్లాడుతూ తమది లేపాక్షి మండలం చోళ సముద్రం గ్రామం అని చెప్పారు. మూడు సంవత్సరాల క్రితం ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ పరిశ్రమలో శివకుమార్‌కుఉద్యోగం రావడంతో పరిగి లోనే నివాసం ఉంటున్నామన్నారు. తన భర్త పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని, గురువారం ఉదయం విధులకు పోయే సమయంలో సైతం ఆరోగ్యంగా వెళ్లాడని, విధులకు పోయిన రెండు గంటల్లోనే మృతి చెందడం పై పలు అనుమానాలు ఉన్నాయని మృతుని భార్య ఆరోపించింది. మృతిపై సమగ్ర విచారణ జరిపించి, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగడు తెలిపారు.

శివకుమార్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలి : సిఐటియు

ఇండియన్ డిజైన్ గవర్నమెంట్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన దళిత శివకుమార్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పరిశ్రమలో కార్మికుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్‌పి శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, సిఐటియు నాయకులు రాము తదితరులు ఆసుపత్రి వద్దకు వచ్చి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాము అండగా ఉంటామని, అధైర్య పడవద్దని వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పరిగి, హిందూపురం రూరల్ మండలం తూముకుంట, గోళాపురం, లేపాక్షి, చిలమత్తూరు మండల పరిధిలో ఉన్న గార్మెంట్స్ పరిశ్రమల్లో కార్మిక చట్టాలను ఏ ఒక్కరు పాటించడం లేదన్నారు. కార్మికుల శ్రమను దోపిడీ చేస్తు, కనీస వేతన చట్టాన్ని సైతం అమలు చేయడం లేదన్నారు. పరిశ్రమల్లో సౌకర్యాలు లేకపోవడంతోనే పరిగి వద్ద ఉన్న ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ పరిశ్రమలో దళిత శివకుమార్ విధులు నిర్వహిస్తు మృత్యువాత పడ్డారన్నారు. పరిశ్రమల ఇన్స్‌పెక్టర్ నుంచి కార్మిక శాఖ అధికారుల వరకు మామూళ్ల దండుకుని పరిశ్రమ యాజమాన్యాలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్నారు. దళిత శివకుమార్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మిక చట్టాన్ని అనుసరించి విధి నిర్వహణలో కార్మికుడు మృతి చెందితే అతని వయసు, వేతనాన్ని బట్టి అతని సర్వీస్ లెక్కించి ఎక్స్ గ్రేషియా తో పాటు కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. మృతునిభార్యకు పరిశ్రమలో పర్మనెంట్ ఉద్యోగిగా నియమించి కార్మికుడికి ఉన్న ఇద్దరు పిల్లలను పరిశ్రమ యాజమాన్యం దత్తత తీసుకుని వారి చదువుకు అయ్యే ఖర్చులు భరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుని కుటుంబానికి న్యాయం జరిగే వరకు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సిఐటియు, కెవిపిఎస్ నాయకులు

ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి

రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల సమస్యలు

వినతిపత్రాలు అందించిన ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి, పలువురు మంత్రులకు ఎమ్మెల్యే పరిటాల సునీత, యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ కోరారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జలవనరులు, దేవాదాయ, విద్యుత్, పర్యాటక, గనుల శాఖల మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. జాకీ పరిశ్రమ ఏర్పాటు, నడిమివంక రక్షణ గోడనిర్మాణం, పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని గ్రామీణ రహదారుల నిర్మాణంపై ముఖ్యమంత్రిని కోరారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని నడిమివంక రక్షణ గోడ నిర్మాణానికి, నియోజకవర్గంలో ప్రాజెక్ట్ పనుల గురించి వివరించారు. పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులు, గేట్ల మరమ్మతులుపైనా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పీఏబిఆర్ కుడి కాలువ ద్వారా 53 చెరువులకు నీరందించాలన్నారు. హెచ్చెల్సీ ద్వారా పులివెందుల బ్రాంచి కెనాల్‌కు నీరు విడుదల చేయాలన్నారు. ఈ కాల్వ నుంచి తాడిమర్రి మండలంలోని చివరిచెరువు వరకు నీరు అందేలా చూడాలన్నారు. ముదిగుబ్బ మండలంలో జిల్లేడుబండ ప్రాజెక్టు పనులు నిలిపివేశారని, ఈ ప్రాజెక్టు పరిధిలో రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, పరికరాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని కలసి గ్రామాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో దేవాలయాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలోని తిరుమల దేవర స్వామి ఆలయంలో దుర్గాదేవి ఆలయానికి మెట్ల ఏర్పాటు, రూ.50 లక్షలతో స్నాక్ బార్ మరుగుదొడ్లను నిర్మించాలన్నారు. పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి రాప్తాడు, ధర్మవరం నియోజవర్గాల్లో పర్యాటక రంగ అభివద్ధి కోసం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తిరుమల దేవర వెంకటేశ్వర స్వామి ఆలయంలో పర్యాటక సౌకర్యాల అభివద్ధి, ఎన్‌హెచ్ 44 అనంతపురం సమీపంలోని మారూరు టోల్ గేట్ వద్ద రూ.25 లక్షలతో స్నాక్ బార్ నిర్మాణం, ఆత్మకూరు జాతీయ రహదారి సమీపంలో టూరిజం వే సైడ్ సౌకర్యాలు, నసనకోట ముత్యాలమ్మ గుడి దగ్గర పిల్లలు ఆడుకోవడానికి ప్లే ఏరియా, టూరిజం రెస్టారెంట్, మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. చెన్నేకొత్తపల్లి మండలం కోన శివాలయం వద్ద పిల్లలు ఆడుకోవడానికి ప్లే ఏరియా, టూరిజం రెస్టారెంట్, మరుగుదొడ్లు నిర్మాణం చేయాలన్నారు. పేరూరు డ్యామ్ వద్ద బోటింగ్ అభివద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రని కలిసి రామగిరి బంగారు గనులనుతెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి


ప్రజాశక్తి-హిందూపురం

అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సాయి రాం ఫంక్షన్ హాల్ లో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి. శ్రీనివాసులు, సిఐటియు మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి కోశాధికారి శ్రీదేవి తదివతరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో జరిపే పోరాటాల గురించి చర్చించారు. అనంతరం ప్రాజెక్టు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు అధ్యక్షురాలుగా శోభమ్మ, కార్యదర్శిగా అరుణ, కోశాధికారిగా శశికళ, ఉపాధ్యక్షులుగా మంజుళ, సహాయ కారదర్శిగా జయసుధ, కమిటీ సభ్యులుగా సుప్రజ, మాధవి, భాగ్యమ్మ, మంజుళ, శాంతమ్మ, శివమ్మ, భారతి, శ్రీవల్లి, అంజలీదేవితో 26 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు విఆర్ రాము, రాజప్ప, రామకృష్ణ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ ఉరుసుకు కలెక్టర్, ఎస్పీకి ఆహ్వానం

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ శ్రీబాబాయ్య స్వామి 752వ ఉరుసు మహోత్సవానికి జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ రత్నను నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దర్గా కాబోయే పీఠాధిపతి సలావుద్దీన్ బాబా, ముస్లీం నగార జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫరూక్ ఖాన్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.





పెనుకొండ ఉరుసు ఆహ్వాన పత్రికలు కలెక్టర్, ఎస్పీకి అందజేస్తున్న దృశ్యం

పంచాయతీ కార్మికుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న మాట్లాడుతూ ముదిగుబ్బ మేజర్ పంచాయతీ లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు 2016 నుంచి ఆర్డర్ కాపీ ఇవ్వడం లేదన్నారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు అందించాలని, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేశు, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, టైలర్ ముస్తఫా, రఫీ, నౌషాద్, పంచాయతీ కార్మికులు ఆదినారాయణ, ఓబులేసు, సావిత్రి, హరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో బుక్కపట్నం విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - బుక్కపట్నం

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో మండలంలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని హైందవి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండవ స్థానంలో నిలిచింది. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని హైందవి ఈ నెల 16, 17,18 వ తేదీలలో గుడివాడలో జరిగిన అండర్ 19 విభాగంలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ 82, 86 కేజీల కేటగిరిలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనపరిచి రెండవ స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వనజాక్షి, పిడి ఉషారాణి, పాఠశాల సిబ్బంది అభినందించారు.



ప్రతిభా విద్యార్థినితో ఉపాధ్యాయులు

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

తూనికలు కొలతల ఇన్స్‌పెక్టర్ శివ శంకర్

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ వ్యాప్తంగా ఉన్న దుకాణదారులు వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల ఇన్స్‌పెక్టర్ శివ శంకర్ హెచ్చరించారు. పట్టణంలోని డిబి కాలోని వద్ద ఉన్న మోర్ సూపర్ మార్కెట్‌లో వస్తువులను ధరలకు విక్రయిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజాశక్తి దినపత్రిక 'ధరలు మోర్' అనే శీర్షికతో బుధవారం వెలుగులోకి తీసుకువచ్చింది. దీనిపై స్పందించిన తూనికల కొలతల శాఖ ఇన్స్‌పెక్టర్ శివ శంకర్ గురువారం మోర్ సూపర్ మార్కెట్‌ను తనిఖీ చేశారు. అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తున్నట్లు గుర్తించి జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతు పట్టణంలో ఉన్న సూపర్ మార్కెట్ తో పాటు దుకాణదారులు ఎవరైనా వారు విక్రయించే వస్తువులను అధిక ధరలకు విక్రయించడం. తూకాల్లో మోసం చేయడం లాంటివి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇష్టపడి చదవండి : డిఇఒ

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

పదవ తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డిఇఒ కిష్టప్ప సూచించారు. పదోతరగతి విద్యార్థుల కోసం ఏపీఎంఎఫ్ రూపొందించిన గణిత దీప్తి మెటీరియల్‌ను డిఇఒ గురువారం ఆవిష్కరించారు. కొత్తచెరువులోని విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏపీఎంఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కడియాల మల్లికార్జున ఆధ్వర్యంలో ఈ మెటీరియల్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు దీని ద్వారా విద్యార్థుల మంచి మార్కులు సంపాదించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఇఒ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుడిబండ

మండలకేంద్రంలో గుండుమల పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈవైద్య శిబిరంలో హెచ్ఐవిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పి రమేష్ యాదవ్, జోనల్ సూపర్‌వైజర్ వెంకట్, ఎంఎల్‌హెచ్‌పి హేమలత, ఎఎన్‌ఎం సావిత్రమ్మ, లింక్ వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కటారపల్లికి చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెక్కమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. శ్రీనివాసులు ప్రతి సంవత్సరం తన తల్లిదండ్రులు వెంకటరమణ సిద్ధమ్మ, జ్ఞాపకార్థంగా విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ఎంఇఒ కృష్ణ నాయక్, కాంప్లెక్స్ చైర్మన్ ఆదినారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహులు నరేంద్ర, ప్రసన్న, కృష్ణారెడ్డి, ఫిరోజ్, ఆనంద్ రెడ్డి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల ప్రజావేదిక

ప్రజాశక్తి బత్తలపల్లి

తాడిమర్రి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నిర్వహించారు. ఎపిఒ సంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో 1-4-2023 నుండి 31-4-2024 వరకు ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలో వెల్లడైన విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పి తిరుమలేష్, ఎపిఒ సంజీవరెడ్డి, ఎపిఎం సాంబశివుడు, ఇసి అశోక్‌కుమార్‌రెడ్డి టిసిలు, డిఆర్‌పిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - గుడిబండ

మండల పరిధిలోని మద్దనకుంట, కేకే పాలెం పాఠశాలలకు చెందిన 28 మంది విద్యార్థులకు ఆర్డీటీ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. మద్దనకుంట పాఠశాలలో చదువుతున్న11 మంది విద్యార్థులకు, కేకే పాల్యం పాఠశాలలో చదువుతున్న 17 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసినట్లు ఆర్డీటీ ఎటిఎల్ మీనాక్షి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఆర్‌డి మల్లికార్జున, మద్దనకుంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోతిరెడ్డి,కేకే పాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత, విద్యా కమిటీ చైర్మన్ వీరముద్దప్ప, రాజకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు, పాల్గొన్నారు.

సంస్కృతి కళాశాలపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి పట్టణం బీడుపల్లి సమీపంలో గల సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు జెఎన్‌టియు విసి సుదర్శన్ రావుకు వినతి పత్రం సమర్పించారు. గురువారం అనంతపురంలోని జేఎన్టీయూ యూనివర్సిటీలో విసిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పిఎస్‌యు నాయకులు నాగ సాయి, చిన్ని, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

23న చేపల చెరువులు వేలం

ప్రజాశక్తి - గుడిబండ

మండల పరిధిలోని కరికెర పంచాయతీ పరిధిలో ఉన్న రాజబండ చెరువు, హిరేతూర్పి చెరువు, కరికెర చెరువుల్లో చేపట పెంపకానికి ఈనెల 23న వేలం పాటను నిర్వహిస్తున్నట్లు ఇఒఆర్‌డి నాగరాజు నాయక్, స్థానిక సర్పంచి లక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి దాదా కలందర్ భాషా తెలిపారు. ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించనున్నట్లు అదే విధంగా మధ్యాహ్నం 2 గంటలకు కొంకల్లు చెరువుకు వేలం పాటను నిర్వహించనున్నట్లు ఇఒఆర్‌డి నాగరాజు నాయక్, సర్పంచి కవిత ఓబన్న, పంచాయతీ కార్యదర్శి హరీష్ తెలిపారు.

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పరిగి

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సవిత ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం రసాభాసగా కొనసాగింది. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే అధికారులు ప్రజాప్రతినిధులను పట్టించుకోవడంలేదని కనీసం అధికారిక కార్యక్రమాలకు సర్పంచులను, ఎంపీటీసీలను ఆహ్వానించడం లేదని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఎన్నుకున్న తమనే అధికారుల విస్మరించి పనిచేయడం సరికాదని అధికారుల పనితీరు మారకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సింగల్ విండో అధ్యక్షుడు మారుతిరెడ్డి మాట్లాడుతూ గ్యాస్ కంపెనీలో యాజమాన్యం తక్కువ కొలతలతో అమ్మకాలు నిర్వహిస్తున్నదని అధికారులు స్పందించి గ్యాస్ ఏజెన్సీలో తనిఖీలు నిర్వహించాలన్నారు. మండల వ్యాప్తంగా ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా నిర్వహిస్తున్న రోడ్డు పనుల్లో నాణ్యత పాటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ప్రభుత్వం ద్వారా నిర్వహించే అధికారిక కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులకు కచ్చితంగా సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమయంలో సభలో గందరగోళ పరిస్థితులు నెలకొనగా ఎస్ఐ రంగడు సర్వసభ్య సర్ధిచెప్పేందుకు ప్రయత్నించారు. అయితే సభ్యులు సభ నుండి వాకవుట్ చేసేందుకు ప్రయత్నించారు. స్పందించిన ఎంపీడీవో శ్రీధర్ భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో సభ కొనసాగింది. ఈసందర్భంగా అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న పథకాల గురించి వివరించారు. ఈసమావేశంలో వైస్ ఎంపీపీ వేదవతి, జడ్‌పిటిసి శ్రీరాములు,స్పెషల్ ఆఫీసర్ ప్రసాద్, ఎంఇఒ లక్ష్మీదేవితో పాటు సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా శాఖల అధికారులు. సభ్యులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ విషయంపై సభ్యులు ఆగ్రహం



అధికారులతో వాగ్వాదానికి దిగిన సభ్యులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి గాండ్లపెంట

ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బడాసుబ్బిరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధర్నాకు సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు వ్యవసాయ కార్మికులకు పదివేల రూపాయలు పింఛను సౌకర్యం వర్తింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కెకె. రాజారెడ్డి, ఖాదర్‌బాషా, సిఐటియు సాంబశివ రైతులు తదితరులు పాల్గొన్నారు

మోటార్ వాహనాల చట్టం రద్దు చేయాలి

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ట్రాన్స్ పోర్ట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెడబల్లి బాబా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పాలసముద్రం క్రాస్ వద్ద గురువారం ఆటో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెడబల్లి బాబా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మోటార్ వాహనాల చట్టం రద్దు చేయాలన్నారు. ఈ చట్టం వస్తే వాహనదారులు భారీగా నష్టపోతారన్నారు. రవాణా రంగంలోని సమస్యల పరిష్కారానికి ఈనెల 26వ తేదీన సత్యసాయి కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, చేనేత కార్మిక సంఘం నాయకులు రాజగోపాల్, ఆటో కార్మికుల యూనియన్ నాయకులు ఆదిరెడ్డి, బాషా, ఆదినారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు, ఆటో కార్మికులు

కదిరిలో ఎడిజె కోర్టు ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే



అసెంబ్లీలో మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి నియోజవర్గంలోని ఆరు మండలాలతో పాటు పుట్టపర్తి నియోజకవర్గం లోని 4 మండలాల ప్రజల సౌకర్యార్థం కదిరిలో ఎడిజె కోర్టు ఏర్పాటు చేయాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కోరారు. గురువారం అమరావతిలోని అసెంబ్లీలో నిర్వహించిన శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పలు సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. కర్నూల్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై అసెంబ్లీలో న్యాయశాఖ మంత్రి ఫారుక్ తీర్మానం ప్రవేశపెట్టారు. స్వల్పకాలిక చర్చలో భాగంగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడారు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాయలసీమ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే విధంగా కర్నూల్ లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడంపై రాయలసీమ వాసిగా హర్షిస్తున్నానన్నారు. సమర్థవంతమైన నాయకత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుది అన్నారు. నిర్మాణాత్మకంగా ఆలోచించే నాయకుడికి అధికారం ఇస్తే దాని ఫలితం ఎలా ఉంటుందో ఈ తీర్మానం ఉదాహరణగా నిలిచిపోతుందని తెలిపారు. ఈ తీర్మానం ప్రవేశపెట్టిన ప్రవేశపెట్టినందుకు రాయలసీమ తరపున కదిరి నియోజకవర్గ ప్రజలు తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పెనుకొండ టౌన్

రాయలసీమలో హై కోర్టు ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తగిన చర్యలు తీసుకోవాలని అఖిలభారత న్యాయవాదులు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం. భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పెనుకొండ పట్టణంలోని తన కార్యాలయంలో అయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కర్నూల్ లో హై కోర్టు ఏర్పాటు కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. హై కోర్టు ఏర్పాటు పనులకు సన్నద్ధం అయిన తరుణంలో ప్రభుత్వం మారిందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా రాయలసీమలోని కర్నూల్‌లో హై కోర్టు ఏర్పాటు చేస్తుందని రాయలసీమ లోని న్యాయవాదులు భావించారని తెలిపారు.అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు కర్నూల్ లో హై కోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని చెప్పడంతో రాయలసీమలోని న్యాయవాదులు నిరసన గళాన్ని వినిపిస్తూ కోర్టు విధులు బహిష్కరణలు చేస్తున్నారని తెలిపారు. కర్నూల్‌లో హై కోర్టు తోపాటు మానవ హక్కుల కమిషన్ కూడా అమరావతికి తరలిపోతోందన్న వాదనలు ఉన్నాయని వాటిని ప్రభుత్వం నివృత్తి చేయాలని కోరారు.

ఎంపిఇఒలను సొంతజిల్లాల్లో విధుల్లోకి తీసుకోవాలి

పుట్టపర్తి రూరల్ : వ్యవసాయ శాఖలో ఒడి బేసెస్ మీద అనంతపురం జిల్లా నుంచి చిత్తూరు ,తిరుపతి జిల్లాలకు వెళ్లి కొంతకాలము విధులు నిర్వహించి, వివిధ కారణాలవల్ల విధులకు హాజరు కాలేకపోయిన ఎంపీఈవోలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎంపిఇఒలు కోరారు. ఈ మేరకు వారు గురువారం జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ వి సుబ్బారావుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 206 మంది ఎంపీఈవోలను ఒడి బేసిస్ మీద చిత్తూరు, తిరుపతి జిల్లాలకు కేటాయించారన్నారు. అందులో ప్రస్తుతం 103 మంది ఎంపీఈవోలు మాత్రమే చిత్తూరు, తిరుపతి జిల్లాలలో పని చేస్తున్నారన్నారు. మిగిలిన ఎంపీఈఓల్లో అధికంగా మహిళలు (చిన్న పిల్లల తల్లులు, గర్భిణులు), వికలాంగులు ఉన్నారన్నారు. వారు 6,7 నెలలు పని చేసి, కుటుంబ పరిస్థితుల దృష్ట్యా, ఆర్థిక, ఆరోగ్య సమస్యల వల్ల చిత్తూరు, తిరుపతి జిల్లాలలో విధులు నిర్వహించలేక విధులకు గైర్హాజరయ్యారన్నారు. వారి కుటుంబాల కుటుంబాల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కేటాయించిన విధులు నిర్వహించలేకపోయామని అప్పట్లో అధికారులకు నివేదికలు సమర్పించారన్నారు. వీరిని తిరిగి సత్యసాయి జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాలలో విధులు కేటాయించాలని కోరారు.

డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో నేరాలను నియంత్రించే చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న మారుమూల ప్రాంతాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై నిఘా పెట్టేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి.రత్న పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ అధికారులకు డ్రోన్స్ ను ఎలా ఉపయోగించాలన్న వాటిపై నిపుణులు అవగాహన కల్పించారు. అనంతరం పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ వి.రత్న డిఎస్పీలు, సిఐ లతో కలిసి డ్రోన్స్ ఎలా వినియోగించాలన్న దానిపై పరిశీలించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్ టీజింగు, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ప్రాంతాలు, కోడి పందాలు, పేకాటలు నిర్వహించేందుకు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను, నిశిత ప్రాంతాలను, తోటలు, బహిరంగ ప్రదేశాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్య కూడళ్ళలో ట్రాఫిక్ నియంత్రణ, మహిళలపై దాడులను నియంత్రించేందుకు, సుదూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టేందుకు డ్రోన్స్ వినియోగిస్తున్నట్లు చెప్పారు. డ్రోన్స్ వినియోగంపై పోలీస్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయకుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఏఆర్ డిఎస్‌పి విజయ్ కుమార్, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఆర్ఐలు వలి, మహేష్, సిఐలు, ఎస్ఐలు ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో ఎనుములపల్లి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అండర్ 19 స్కూల్ గేమ్స్ బాల్ బాడ్మింటన్ పోటీలలో పుట్టపర్తి మండల పరిధిలోని ఎనుములపల్లిఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 9, 10 తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో నిర్వహించిన అండర్ 19 బాలికల విభాగంలో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు రాష్ట్రస్థాయి పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచింది. అదేవిధంగా బాలుర విభాగంలో అనంత జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. జిల్లాకు ప్రాతినిధ్యం వహించి రాష్ట్రస్థాయి పోటీలలో ద్వితీయ, నాలుగవ స్థానంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సుధాకర్, పీడీ రమేష్ బాబు, పాఠశాల సిబ్బంది అభినందించారు.



ప్రతిభా క్రీడాకారులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-హిందూపురం



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గురువారం అండర్ -16 బాల, బాలికల రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల కోసం క్రీడాకారుల ఎంపిక జరిగింది. రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి టీఎస్ ప్రభుకుమార్, జిల్లా త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి, ఎంజీఎం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సురేష్ బాబు పర్యవేక్షణలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ఉత్తమ నైపుణ్యత కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24 వ తేదీన గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారన్నారు. బాలుర జట్టుకు సి.స్వర్ధాన్, ఎం.దర్శన్, కే. ప్రభాస్ ఈశ్వర్ ఎంపిక కాగా బాలికల జట్టుక ఎస్ . షిఫా అనుజుమ్, ఎన్ . ప్రణీత, కె. భవ్యశ్రీ ఎంపికైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రమణ, ఫిజికల్ డైరెక్టర్ లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని వినాయక్ నగర్‌కు చెందిన నవీన్(33) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. నవీన్ కొత్తపల్లి క్రాస్ సమీపంలో గల పెట్రోల్ బంక్ దగ్గరగా ఉన్న ఓ కాంప్లెక్స్ లో ఎలక్ట్రానిక్స్ షాప్ నిర్వహించుకుంటూ ఉండేవాడు. గురువారం అదే షాపులో షెటర్ దించివేసి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు సోమందేపల్లి ప్రాథమిక ఆసుపత్రికి తీసుకువెళ్లి,మెరుగైన చికిత్స కోసం పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే నవీన్ మృతిచెందినట్లు ధృవీకరించారు. మృతునికి భార్య జయలక్ష్మి, మూడు సంవత్సరాల వయసు కల కుమారుడు, ఒక సంవత్సరం వయసు గల కుమార్తె ఉన్నారు. నవీన్ మృతికి గల కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సుంది.

ఆటో బోల్తా ... మహిళ మృతి

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడిన ఘటనలో మహిళ మృతి చెందింది. పలువురికి గాయాలయ్యాయి. పెనుకొండ మండలం కుంభకర్ణ ప్రాజెక్టు సమీపంలో గురువారం చోటుచేసుకున్న ఈ ప్రమాదానికి సంబంధించి కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ అందించిన వివరాలు.. ధర్మవరం పట్టణం జేజే నగరకు చెందిన ఓబులమ్మ(49) మరో నలుగురుతో కలిసి ఆటోలో పెనుకొండకు వస్తున్నారు. మార్గం మధ్యలో కుంభకర్ణ ప్రాజెక్టు సమీపం వద్ద ఆటో ముందు చక్రం విడిపోయింది. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓబులమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. ఆటో డ్రైవర్ మురళి చంద్రశేఖర్, లోకేశ్వరి, ఆదెమ్మ, పుష్పలతలకు స్వల్ప గాయాలయ్యాయి క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పశువుల తరలింపు వాహనాలు సీజ్

ప్రజాశక్తి - గోరంట్ల

గోరంట్ల పట్టణం నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా ఆవులను, లేగ దూడలను తరలిస్తున్న వాహనాలను సిఐ శేఖర్ సీజ్ చేశారు. గురువారం .ఉదయం మినీ గూడ్స్ వెహికల్ లో 11 లేగ దూడలు తరలిస్తుండగా ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే మరో గూడ్స్ వెహికల్ లో 9 ఆవులు తరలిస్తుండగా ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. పశువులను గోశాలకు అప్పగించారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-పెనుకొండ

కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురైన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పెనుకొండ మండలం మావటూరులో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు... మావటూరు గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి(35) కుటుంబ కలహాలతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంటి పక్కనే ఉన్న షెడ్డులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం అక్రమ విక్రయాలు జరిపితే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. రెండు రోజులుగా విస్తత దాడులు నిర్వహించి పలువురిని అరెస్టు చేసి వారి నుండి అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని రిమాండ్ పంపినట్లు ఆయన తెలిపారు. గొర్రెపల్లి గేట్ వద్ద యూసుఫ్ ఖాన్ అనే వ్యక్తి నుండి 40 హైవార్డ్స్ విస్కీ కరానటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా పులమతి క్రాస్ లో చంద్రప్ప అనే వ్యక్తి నుండి 30 హైవార్డ్స్ విస్కీ కర్నాటక మద్యం స్వాధీనం చేసుకొని రిమాండ్ పంపినట్లు చెప్పారు. దీనికి తోడు మంజుల అను మహిళ నుండి 20 హైవార్డ్స్ బాటిల్స్‌ను, ముదిరెడ్డిపల్లికి చెందిన డి.గంగాధర్ అనే వ్యక్తి నుండి 10 ట్రోఫికన్ బ్రాందీ బాటిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పృధ్వీరాజ్, ఫరూక్, హెడ్‌కానిస్టేబుళ్లు నరసింహ, రమణ, సతీష్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, సురేష్, సుధాకరెడ్డి, శివ కుమార్, రవీంద్ర, కుమార్, రంగధామ, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారని సిఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి - బత్తలపల్లి

తాడిమర్రి మండలకేంద్రంలోని కెజిబివి విద్యార్థులకు ఎస్ఐ కష్ణవేణి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. బాలికలు సమాజంలో ప్రతి ఒక్కరితో జాగ్రత్తగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

సమర్థనం ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి- చిలమత్తూరు

మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు వద్ద గల సమర్థనం ట్రస్ట్‌కు వైసిపి యువనాయకులు వెంకటరెడ్డి బియ్యం బస్తాలను విరాళంగా ఇచ్చారు.తన కుమార్తె తీక్షక జన్మదినం సందర్భంగా వికలాంగులతో కలసి కేక్ కట్ చేశారు. అనంతరం వారికి బియ్యం బస్తాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు తదితరులు తెలిపారు.

27న మండల మీట్

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఈనెల 27వ తేదీ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నటరాజు తెలిపారు. ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ముదిగుబ్బ ఎస్ఐగా ఇషాక్‌బాషా

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ అప్‌గ్రేడ్ స్టేషన్ ఎస్ఐగా ఇషాక్‌బాషా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద రెవిన్యూ గ్రామ సభను గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు తమ సమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమం లో రెవిన్యూ సిబ్బంది వన్నూరప్ప, విఆర్ఒ రాజేష్ ప్రజలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగవద్దని వారి గ్రామాలలో నిర్వహించే గ్రామసభల దృష్టికి సమస్యలను తీసుకువచ్చి పరిష్కరింప చేసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ షణ్ముఖ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఈదుల ముష్టూరులో సర్పంచి మునలప్ప అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిటి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ప్రజలు తమ సమస్యలను గ్రామ సభ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరింప చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లాయర్ కరణం సూర్యప్రకాష్ రావు, వీఆర్వో ముత్యాలన్న, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, గ్రామ సర్వేయర్ విజయ్, ఈదుల ముష్టూరు, సంజీవపురం, రాఘవంపల్లి, లింగారెడ్డిపల్లి, యర్రాయపల్లి ప్రజలు పాల్గొన్నారు.

బుక్కపట్నం : గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలను ప్రవేశపెట్టిందని తహశీల్దార్ షాబుద్దీన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలతో పాటు, పలు సమస్యల పరిష్కారానికి గ్రామసభ ఒక వేదిక అని, ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.